చెరిగిపోతున్న శుభ్రత

- వాటర్ ట్యాంకుల్లో కానరాని క్లోరినేషన్
- ట్యాంకులపై చెరిగిపోయి కనిపిస్తున్న శుభ్రత బోర్డులు
- ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణ లోపమే దుస్థితికి కారణం
- పీడబ్ల్యూడీ తాగునీటిపై సర్వత్రా సందేహాలు



చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని మెట్టకాలనీలో 1.20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్

చీపురుపల్లి: రక్షిత మంచినీటి పథకాలు సురక్షిత మేనా..టే కాదని సాక్షాత్తూ ఆ రక్షిత మంచినీటి పథకాలకు చెందిన వాటర్ ట్యాంకులు చూస్తేనే అర్థమవుతోంది. రక్షిత మంచినీటి పథకాల వాటర్ ట్యాంకులపై శుభ్రపరిచిన తేదీలకు సంబంధించి బోర్డులు చెరిగిపోయి ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రజలకు ఎంతో సురక్షితమైన తాటి అందించాలనే ఉద్దేశంతోటైన రక్షిత మంచినీటి పథకాలు ప్రస్తుతం ఎలాంటి నీటిని అందిస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్ర పరచాల్సిన యంత్రాంగం నిద్రావస్థలో ఉండగా, ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నారో లేదో పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సైతం అటు వైపు చూడకపోవడంతో ప్రజలకు రక్షణ లేని తాగునీరు అందుతోందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



చెరిగిపోయి ఉన్న శుభ్రం చేసిన తేదీల బోర్డు

ప్రతీ నెలా క్లోరినేషన్ చేయాల్సి ఉన్నప్పటికీ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత మంచినీరు అందించాల్సిన వాటర్ ట్యాంకులు ప్రతీ నెలా క్లోరినేషన్ చేయాల్సి ఉందని అధికారులే చెబుతున్నారు. వందల లీటర్ల నీరు ప్రతీరోజూ నింపుకునే వాటర్ ట్యాంకు కనీసం నెలకోసారి క్లోరినేషన్ చేయకపోతే నాచు పట్టే అవకాశం ఉంది. దీంతో రక్షిత మంచినీరు కాస్త కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అందుకనే ప్రతీ నెలా వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేసి అదే ట్యాంకుపై ఉన్న బోర్డులో ట్యాంకు ఎప్పుడు శుభ్రం చేసారో మళ్లీ ఎప్పుడు శుభ్రం చేయాల్సి ఉందో అనే తేదీలు వివరాలు రాయాల్సి ఉంది. కానీ ఇవేవీ జరగడం లేదు.

ట్యాంకులపై చెరిగిపోతున్న బోర్డులు

రక్షిత మంచినీటి పథకాలకు చెందిన వాటర్ ట్యాంకులపై శుభ్రపరిచిన తేదీలకు సంబంధించిన బోర్డులు చెరిగిపోతున్నాయి. అదేంటి చెరిగిపోతున్నాయా.. అనుకుంటున్నారా... చెరిగిపోవడం కాదు బహుశా చెరిపేస్తున్నారేమో అనే చర్చ కూడా జరుగుతోంది. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్ర పరిచిన తేదీలతో పాటు తిరిగి ఎప్పుడు శుభ్ర పరచాల్సి ఉందో తేదీలతో కనిపించాల్సిన బోర్డులు చెరిగిపోయి కనిపిస్తుండడం దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. ఈ విషయంలో రక్షిత మంచినీటి విభాగం అధికారులు పర్యవేక్షణ లోపం స్పష్టమవుతోంది.

నెలకోసారి క్లోరినేషన్ చేయాలి

రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు ప్రతీ నెలా క్లోరినేషన్ ద్వారా శుభ్రం చేయాల్సి ఉంది. ట్యాంకులు శుభ్రం చేసి ఆ ట్యాంకుపై ఉన్న బోర్డుపై తేదీలు నమోదు చేయాల్సి ఉంది. పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. రక్షిత మంచినీటి విభాగం అధికారులు పర్యవేక్షణ చేయాలి.

– శ్రీలత, డీఈఈ, రక్షిత మంచినీటి విభాగం చీపురుపల్లి డివిజన్

క్లుప్తంగా

రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ బహుళ అష్టమి సందర్భంగా జరిగిన ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, దైవం పట్ల ఉన్న భక్తిశ్రద్ధలు కనబరిచారు. భక్తులంతా ఘటాలు, ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రహదారంతా.. గోతులే...



గోతులతో కెఎల్.పురం రహదారి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామానికి వెళ్లే తారు రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. గ్రామంలోకి వెళ్లే తారు రోడ్డు నిలువునా ఎక్కడికక్కడే గోతులు ఏర్పడి రాళ్లు దర్శనమిస్తున్నాయి. రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ గోతులు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం రహదారులకు తొలి ప్రాధాన్యత అని చెప్పి పట్టించుకోవడం లేదని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. రహదారి బాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా గ్రామదేవత పండగ

గంట్యాడ: మండలంలోని పెదమధుపాడ, కరకవలస గ్రామాల్లో గ్రామదేవతల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెదమధుపాడలో కాపమ్మకు, కరకవలసలో నల్లనూకమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఘటాల ఊరేగింపు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సింగంపల్లి అప్పారావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, అధికారులు కూడా హాజరుకావాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

శృంగవరపుకోట: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని బ్యాడ్మింటన్ కోచ్ శ్రీరాములు తెలిపారు. స్థానిక కేంబ్రిడ్జ్, నారాయణ పాఠశాలల్లో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా ఇస్తున్న బ్యాడ్మింటన్ శిక్షణకు హాజరవుతున్న వారికి ఆటవిడుపుగా పుణ్యగిరి విహారయాత్రకు మంగళవారం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, అప్పుడే చదివిన చదువు తలకెక్కుతుందన్నారు. క్రీడాకారుల విహారయాత్రకు పాఠశాల యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించగా, దాతలు అల్పాహారం సమకూర్చారన్నారు.

చెత్త సంపద కేంద్రాలు పరిశుభ్రం



బాగు చేసిన మల్లివీడు చెత్త సంపద కేంద్రం పరిసరాలు

సాక్షి ఎఫెక్ట్

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను పరిశుభ్రం చేసి, వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు చేపడుతున్నారు. ఇదివరకు ఈ కేంద్రాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడం, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండి ఉండడంతో 'ఇదేం చెత్త నిర్వహణ' శీర్షిక పేరిట సాక్షి దినపత్రికలో ఈ నెల 4వ తేదీన వార్తకథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు చెత్త సంపద కేంద్రాలను బాగు చేయించి, వినియోగంలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు.


ఇదేం..చెత్త నిర్వహణ

ఈ నెల 4వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన వార్తా కథనం

వైభవంగా.. అసిరితల్లి పండగ

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో అసిరితల్లి అమ్మవారి గ్రామదేవత పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. దాదాపు 18 సంవత్సరాల తరువాత కర్లాం గ్రామంలో అసిరితల్లి అమ్మవారి గ్రామదేవత పండగ కావడంతో అమ్మవారి సిరిమానోత్సవం అంబరాన్ని తాకింది. గ్రామ సర్పంచ్ బానాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బానాన రామరత్నం, గ్రామ పెద్దలు బానాన శ్రీనివాసరావు, రమణ, రామకృష్ణ, రామారావు ఆధ్వర్యంలో పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. అలాగే ఘటోత్సవంలో భాగంగా భక్తులు దర్శనం చేసుకున్నారు.



కర్లాం గ్రామంలో అంబరాన్ని తాకిన సిరిమానోత్సవం

ఎట్టకేలకు తాగునీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్



తాగునీరు సదుపాయంపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారి

బొండపల్లి: మండలంలోని మధుర గ్రామమైన గొల్లలపేటలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎట్టకేలకు అధికారులు పరిష్కరించారు. తాగునీరు అందక ఆ గ్రామ రామాలయం వీధివాసులు ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల 'తాగునీరు అందించండి మహాప్రభో' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు.. ఆ గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ వాల్వ్ వద్ద సమస్య ఉండడంతో తాగునీరు అన్ని వీధులకూ వెళ్లడం లేదన్నది గుర్తించారు. అనంతరం ఆ సమస్యను పరిష్కరించడంతో గొల్లలపేట వాసులకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాను పునరుద్ధరించారు. ఇకనుంచి అందరికీ తాగునీరు అందేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్

వేపాడ: మండలంలోని మారిక గ్రామాన్ని, భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విషయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి, పరిగణలోకి తీసుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. ఇదే విషయమై ఆయన మండలంలోని జాకేరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసుకు గిరిజనులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎటువంటి భూ సేకరణ చేయవద్దని, అదానీకి భూములు అప్పగించవద్దని ఎన్నో రోజులుగా పోరాడుతున్నామన్నారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, పోరాట కమిటీ నాయకులు జాలారి వీర్రాజు, జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలు అప్పగించండి



కొత్తవలస మండలానికి మంజూరైన ఇళ్లపట్టాలను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన బాధిత లబ్ధిదారులతో కలిసి మండల కేంద్రానికి మంగళవారం వెళ్లి, తహసీల్దారు బి.నీలకంఠారావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 600 మంది ఇళ్ల లేని నిరుపేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయడం జరిగిందని, అయితే ఇంతవరకు ఆ పట్టాలు లబ్ధిదారులకు అందివ్వలేదన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి, ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

–కొత్తవలస

సచివాలయ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?



దత్తిరాజేరు మండలం, పాచలవలస గ్రామ సచివాలయ భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచింది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణ పనులు ప్రారంభం కాగా, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులకు విరామం వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆగిన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చొరవ చూపడం లేదు. వెల్‌నెస్ కేంద్రంలో తాత్కాలికంగా సచివాలయ సేవలు అందిస్తుండడంతో ఆ కేంద్రం దూరంగా ఉందని ప్రతి అవసరానికి వెంటనే వెళ్లలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

–దత్తిరాజేరు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



శృంగవరపుకోట: మండల కేంద్రంలో లేబర్ కోడ్‌లు వ్యతిరేకిస్తూ సీఐటీయూ, కార్మికుల నిరసన

కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ కార్మికులు నిరసనకు దిగారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందివ్వాలని, 8 గంటల పని పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, మూతపడిన పరిశ్రమలు తెరవాలని డిమాండ్ చేశారు. కర్షకుల సంక్షేమం విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే ప్రధాని మోదీ విధానాలను ఖండిస్తూ జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు.



లక్కవరపుకోటలో అరకు-విశాఖ రోడ్డులో కేంద్రం తీరును నిరసిస్తూ ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నాయకుల మానవహారం



కొత్తవలస: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న సీపీఎం నాయకులు



దత్తిరాజేరు: కోమటిపల్లిలో ఆటో కార్మికులతో నిరసనలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి

–లక్కవరపుకోట, శృంగవరపుకోట, కొత్తవలస, దత్తిరాజేరు

అంగరంగ వైభవంగా పైడితల్లి పండగ

వేపాడ మండలం, వల్లంపూడి గ్రామదేవత పైడితల్లి పండగ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. 15 ఏళ్ల తర్వాత జరిగే ఉత్సవం కావడంతో ఉపాధి, ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన గ్రామస్తులంతా గ్రామం చేరుకుని, పండగలో సందడి చేశారు. ఏ వీధి వెళ్లినా.. ఏ రోడ్డు చూసినా జనసంద్రాన్ని తలపించింది. సిరిమాను సహా ప్రతిఇంటి నుంచి బయలుదేరిన ఘటాలను భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పైడితల్లీ..కరుణించమ్మా.. చల్లంగా..చూడమ్మా అని వేడుకున్నారు. వేడుక ఆద్యంతం చేపట్టిన పలు సాంస్కృతి ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళల కోలాటం, బిందెల డ్యాన్స్, పులివేషాలు, అమ్మవార్ల వేషధారణలు, చిన్నవీధి, పెద్దవీధిల నుంచి తీసుకువచ్చిన 40, 42 అడుగుల ఎత్తైన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

–వేపాడ



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభలు



అమ్మవారి ఘటాలతో మహిళలు



అమ్మవార్ల వేషధారణలు



సిరిమాను ఊరేగింపును తిలకిస్తున్న భక్తులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కంచుగుర్రాలు, ఏనుగు



జనసంద్రమైన వల్లంపూడి గ్రామం

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంట్యాడ: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.